మొక్కజొన్న సాగు లాభదాయకం

- తోట్లవల్లూరు మండలంలో విస్తారంగా సాగు
- కింటా మొక్కజొన్న రూ.2,150
- కొనుగోలు కేంద్రంపై రైతుల ఆశలు

తోట్లవల్లూరు: మండలంలోని మొక్కజొన్న సాగు చేసిన రైతులకు దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. పంటకాలం పూర్తి కావస్తుండటంతో అన్నదాతలు మొక్కజొన్న కోత, నూర్పిడి పనులు చేపట్టారు. మార్కెట్‌లో క్వింటా మొక్కజొన్నకు రూ. 2,150 ధర లభిస్తుండగా, ప్రభుత్వమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మరింత లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆశపడుతున్నారు. మండలంలో మొక్కజొన్న పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న రొయ్యూరు, వల్లూరుపాలెం, బొద్దపాడు, చినపులిపాక, తోట్లవల్లూరు, పాములలంక, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు, తదితర గ్రామాల్లోని లంక, మెట్ట, మాగాణి భూములలో మొక్కజొన్నను అధికంగా సాగు చేశారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

గత ఏడాది కృష్ణానది వరదల కారణంగా లంకల్లో పంటలన్నీ దెబ్బతినటం, మినుముకు తెగుళ్ల బెడద, సాగు ఖర్చులు ఎక్కువ అవుతుండటంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగుపై రైతులు దృష్టి సారించారు. గత కొన్నేళ్లుగా మొక్కజొన్నకు మార్కెట్‌లో మంచి ధర కూడా లభిస్తుండటంతో ప్రతి ఏటా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం ఈ ఏడాది సుమారు 4,200 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు.


తోట్లవల్లూరులో మొక్కజొన్నను కల్లంలో ఆరబెడుతున్న కూలీలు

నూర్పిడి పనులు ప్రారంభం

మొక్కజొన్న నూర్పిడి పనులను అన్నదాతలు చేపట్టారు. గత కొన్ని రోజులుగా తోట్లవల్లూరుతో పాటు పలు గ్రామాల్లో మొక్కజొన్నను యంత్రాల ద్వారా కోత కోయించి కల్లాల్లో ఆరబోస్తున్నారు. ఎకరానికి 35 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటా మొక్కజొన్న రూ. 2,150కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. సాగు ఖర్చులు పోనూ ఎకరానికి రూ.40 వేల వరకు మిగులుతాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లయితే మరింత మద్దతు ధర లభించే అవకాశం ఉందని అంటున్నారు.

మొక్కజొన్నకు పెరిగిన డిమాండ్



మొక్కజొన్న పైరు విస్తారంగా సాగవుతోంది. మొక్కజొన్నకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయి. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు మరింత మద్దతు ధర లభించే అవకాశం ఉంది.

– పొనుగుమాటి శ్రీకాంత్, రైతు, పాములలంక

40 క్వింటాళ్ల దిగుబడి



మొక్కజొన్న సాగు లాభదాయకంగా ఉంటోంది. ఎకరం పొలంలో మేము మొక్కజొన్న సాగు చేశాం. పంట కాలం పూర్తి కావటంతో నూర్పిడి చేసి కల్లంలో ఆరబెట్టాం. ఎకరానికి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం.

– ఎండీ రఫీవుల్లా, రైతు, తోట్లవల్లూరు

కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు



మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం.

– జి. నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి, తోట్లవల్లూరు

సీనియర్ సిటిజన్స్‌కు ఎస్‌బీఐలో ప్రత్యేక కౌంటర్

పామర్రు: సీనియర్ సిటిజన్స్ కోసం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పామర్రు శాఖలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయటం అభినందనీయమని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీఐలో సోమవారం కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ బ్యాంక్ వినియోగదారులతో కలిసి క్యూలో ఇబ్బందులు పడేవాళ్లమన్నారు. తమ కోసం ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని మచిలీపట్నం రీజినల్ మేనేజర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. స్పందించిన బ్యాంక్ అధికారులకు సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసిన రీజినల్ మేనేజర్‌కు అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

చెత్త సేకరణకు డస్ట్‌బిన్ల పంపిణీ



గుడ్లవల్లేరు: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుడ్లవల్లేరులో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త నిల్వల డస్ట్‌బిన్ల ప్రజలకు పంచాయతీ సిబ్బంది సోమవారం అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూట్ బ్యాగులను వినియోగించాలని గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు కోరారు.

క్లుప్తంగా

27న ఉపసర్పంచ్ ఎన్నికలు

పమిడిముక్కల: మండలంలోని మంటాడ, తాడంకి, అమీనపురం, ఫతేలంక పంచాయతీల్లో ఈ నెల 27న ఉపసర్పంచ్ ఎన్నికలు జరుగుతాయని ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయా పంచాయతీల్లో ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు పీఓలను నియమించినట్లు తెలిపారు.

నేత్రదానం



పామర్రు: సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యుడు బొమ్మారెడ్డి సుబ్బారెడ్డి (83) అనారోగ్యంతో మృతి చెందగా అతని కళ్లను దానం చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు పేర్కొన్నారు. సోమవారం మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి కళ్లను దానం చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. వారి అంగీకారంతో విజయవాడకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు సమాచారం ఇచ్చామన్నారు. స్పందించిన వైద్యులు కె మహేష్ బృందం వచ్చి సుబ్బారెడ్డి కళ్లను స్వీకరించినట్లు పేర్కొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ పనుల పరిశీలన

మండవల్లి: మండవల్లి ఎస్సీ ఏరియాలో పైప్‌లైన్ లీకేజీ పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రక్షిత తాగునీటి పథకానికి కావలసిన అన్ని పరికరాలు సక్రమంగా ఉంటేనే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ ఎన్నిక నోటిఫికేషన్ ఇవ్వండి



కైకలూరు: కైకలూరు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక నిమిత్తం నోటిఫికేషన్ విడుదల చేయాలని గ్రామస్తులు అబ్దుల్ హమీద్, దండే రవిప్రకాష్ సోమవారం తహసీల్దారు కార్యాలయంలోజరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు ఎండీ ఇబ్రహీంకు అర్జీ అందజేశారు. అనంతరం వీరు మాట్లాడుతూ ఉప సర్పంచ్ మంగినేని పోతురాజు 10 నెలల క్రితం మరణించారన్నారు. ప్రస్తుతం కైకలూరు సర్పంచ్ చెక్ పవర్ రద్దయిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉప సర్పంచ్ ఎన్నిక అనివార్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని పంచాయతీలో ఉప సర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చి కై కలూరులో ఇవ్వలేదన్నారు. అధికారులు ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని కోరారు.

తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ నిర్లక్ష్యం



గుడ్లవల్లేరు: డోకిపర్రులో తాగునీటి సరఫరాకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ కొడాలి సురేష్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డోకిపర్రులో ప్రజల తాగునీటి ఇబ్బందులపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ రూపేష్‌కు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. రూపేష్ కనీసం మండల సర్వసభ్య సమావేశాలకు కూడా రాకుండా గైర్హాజరవుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని డోకిపర్రుకు తాగునీటిని అందించాలని ఎంపీపీ కోరారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

ముదినేపల్లి రూరల్: మద్యం మత్తులో ఒక వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసిన ఘటన మండలంలోని గురజలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన కాటే చంద్రరావుపై దిలీప్‌కుమార్ అనే వ్యక్తి మద్యం తాగి అకారణంగా దాడి చేసి గాయపరిచినట్లు చంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కై కలూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

కైకలూరు: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కై కలూరు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో కై కలూరు సీహెచ్‌సీ నుంచి క్షయ నివారణ అవగాహన ర్యాలీ, మానవహారం సోమవారం నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందికి ఎన్జీవోస్ హోంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, శీతనపల్లి, కొల్లేటికోట పీహెచ్‌సీల డాక్టర్లు అన్నపూర్ణ, కిరణ్ మాట్లాడుతూ రెండు వారాలకు తగ్గకుండా దగ్గు, జ్వరం, ఆకలి, బరువు తగ్గిపోవటం వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ఆస్పత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని పేర్కొన్నారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ గతేడాదికి సంబంధించి టీబీ ముక్త్ భారత్ పంచాయతీల కింద కై కలూరు టీబీ యూనిట్‌లో 14 పంచాయతీలను ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు, సీహెచ్‌సీ డాక్టర్లు శ్వేతా, ప్రసన్న, సూపర్‌వైజర్లు తాతారావు, శ్రీనివాస్, లక్ష్మీకుమారి, పీహెచ్ఎన్ కనకదుర్గ పాల్గొన్నారు.


కైకలూరు సీహెచ్‌సీ నుంచి ర్యాలీగా వెళుతున్న డాక్టర్లు

గుడివాడలో...

గుడివాడ టౌన్: క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ నివారణ సులువని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ఇందిరాదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో క్షయ నివారణ దినోత్సవం సోమవారం జరిపారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కైకాల సత్యన్నారాయణ కళామందిరంలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ఉత్సాహంగా డ్యాన్స్ వేస్తున్న విద్యార్థులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల వార్షికోత్సవ సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలో తొలుత పి.తన్మయి, రోహిణి ప్రియ నాట్య ప్రదర్శనతో అందరినీ ఆహ్వానించారు. అనంతరం పూర్వ విద్యార్థి ఎస్ సాయినాథ్ జ్ఞాపకార్థంగా వారి తల్లిదండ్రులు బి ఫార్మసీ నాలుగు సంవత్సరాల ఎకడమిక్ టాపర్ ఎం.నమితకు రూ.10 వేల బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందించారు. అనంతరం ఎకడమిక్ టాపర్స్‌కు, ఆటల పోటీలలో విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టరేట్ డిగ్రీ పొందిన అధ్యాపకులు డాక్టర్ ఎ.సాయిదాత్రి, డాక్టర్ వి.రజనీని సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు మానస భరతనాట్యంతో మొదలయ్యాయి. జె.కాంక్ష, పి తన్మయి డోలారే డోలా అనే హిందీ పాటకు అద్భుతమైన నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌జీఈసీ కళాశాల నుంచి డాక్టర్ పి రవీంద్రబాబు, డాక్టర్ కరుణకుమార్, డాక్టర్ కోదండరామారావు డాక్టర్ కామరాజు, వార్షికోత్సవ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌కే అమీనాభి, అధ్యాపకులు డాక్టర్ పి.రవిశ, డాక్టర్ ప్రశాంతి డాక్టర్ బాలకష్ణ, సత్య శ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల నాయకుడు బి.వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన వారికి ఒక్కొక్కరికి మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరారు. మినుము ధర క్వింటాల్ రూ.9,200/–కు బోనస్ కలిపి ఇవ్వాలన్నారు. 30 శాతం ఇంకా ధాన్యం కుప్పలు నూర్చకుండా మిగిలిపోయినందున కొనుగోలు కేంద్రాలు మూసేయకుండా కొనసాగించాలని కోరారు. కూటమి నాయకులు హామీల మేరకు 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు అకౌంట్‌లో రూ.1,500 వేయాలన్నారు. నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇవ్వాలన్నారు. 50ఏళ్ళు నిండిన ఎస్సీ, బీసీలకు పింఛను ఇవ్వాలన్నారు. సీపీఎం నాయకులుమేకల ఏసురత్నం, ఆరేపల్లి రమాదేవి, రాజులపాటి శైలజ, నాగమణి, గుడ్లవల్లేరు గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు వెంకటేశ్వరమ్మ, కుమారి, రాజేశ్వరమ్మ, వెన్నెలమ్మ, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన




గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయ సమీపంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ టి.విజయసారథి సోమవారం పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని చెత్త సేకరణతో తయారయ్యే వానపాముల ఎరువును కొనుగోలు చేసే రైతులకు ఆరోగ్యకరమైన పంటలు పండటమే గాక పంచాయతీకి కూడా ఆదాయం లభిస్తోందన్నారు. గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'మీకోసం'లో అర్జీలు



మొవ్వ: ప్రజా సమస్యల పరిశీలన నిమిత్తం సీపీఎం నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం అర్జీల రూపంలో సోమవారం రైతులు, గ్రామస్తులు పేదలు సంతకాలతో 'మీకోసం'లో అందజేశారు. సీపీఎం నాయకులు శీలం నారాయణరావు, ఉప్పలపు వెంకటాద్రి, కాకి రాజశేఖర్, కొడాలి శ్రీనివాసరావు, మద్దుల బసవరావు, చిగురుపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జిగా జయరాజు



చినముత్తేవి(మొవ్వ): కృష్ణా జిల్లా మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా ఇన్‌చార్జిగా మొవ్వ మండలం చినముత్తేవి గ్రామానికి చెందిన నాయకుడు సిద్దెల జయరాజు నియమితులైనట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ మేరకు నియమాకపత్రాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు

గుడివాడరూరల్: మండలంలోని మల్లాయపాలెం పరిధిలోని శ్రీకాళహస్తీకాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. కాలనీలో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత ఆ ప్రాంత వాసులు కాలనీలో ఉన్న సమస్యలతో పాటు తాగునీరు అందడం లేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నెలరోజుల్లో పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణుప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, ఆర్ఐ నాగబాబు, కూటమి నాయకులు సమ్మెట బ్రహ్మాజీ, పంద్రాజు సాంబయ్య, మురళీ పాల్గొన్నారు.


సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న కాలనీవాసులు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

గుడివాడరూరల్: స్థానిక ప్రజావేదికలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 28మంది బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ చెక్కులు ఉపయోగపడుతాయన్నారు.

బోధన పద్ధతుల్లో మార్పులతో సత్ఫలితాలు

కైకలూరు: కళాశాల స్థాయి బోధన పద్ధతుల్లో మార్పులు సత్ఫలితాలనిస్తున్నాయి. కై కలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలూరు సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాలతో విద్యార్థులు, అధ్యాపకుల బోధన మార్పిడి కార్యక్రమంపై ఇటీవల ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో భాగంగా కాలేజీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, ఆక్వా కల్చర్ డిపార్టుమెంటుల విద్యార్థులు, అధ్యాపకులు ఈ నెల 19 నుంచి 24 వరకు సీఆర్.రెడ్డి కాలేజీకి వెళ్లారు. అక్కడ విద్యార్థులకు కైకలూరు కాలేజీ అధ్యాపకులు బోధించారు. కై కలూరు నుంచి వెళ్లిన విద్యార్థులకు సీఆర్.రెడ్డి అధ్యాపకులు బోధించారు. సీఆర్.రెడ్డి కాలేజీలో గ్రంథాలయం, రీసెర్చ్ ల్యాబ్, జిమ్నాషియం, జంతు, ఆక్వా, వృక్షశాస్త్ర ల్యాబ్‌లను కై కలూరు విద్యార్థులు ఉపయోగించుకున్నారు. ఈ సందర్భంగా కైకలూరు ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత మాట్లాడుతూ స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రొగ్రాం విద్యార్థులు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధిలో ఉపయోగపడుతోందన్నారు.

జ్యోతిమిత్ర బిరుదుతో శ్రీనివాస్‌కు సత్కారం


విజయవాడలో జ్యోతిమిత్ర బిరుదుతో శ్రీనివాస్‌కు సత్కారం

మండవల్లి: మండవల్లి గ్రామానికి చెందిన స్వర్ణగ్రహిత, బ్రహ్మర్షి, ప్రముఖ సిద్ధాంతి చాగంటి శ్రీనివాస్‌ను హైదరాబాద్ విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన్ సంస్థ జ్యోతిమిత్ర బిరుదుతో సత్కరించింది. విజయవాడలోని గోల్డెన్ వేలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఉగాది పురస్కారంగా చాగంటిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

వేధింపుల కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: మహిళను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై ముదినేపల్లి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలానికి చెందిన మహిళ కుటుంబసభ్యుడితో పేరూరులో చేపల చెరువుపై పనిచేస్తోంది. ఈ చెరువు సమీపంలోనే మరో చెరువుపై పనిచేసే సతీష్ అనే వ్యక్తి రెండు నెలలుగా తన కోరికను తీర్చమంటూ ఆమెను వేధిస్తున్నాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

సమన్వయ కమిటీ సమావేశం

పామర్రు: ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఎమైనా సమస్యలు ఉంటే వాటిని అధికారులు దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం అయ్యేలా నాయకులు చూడాలన్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ప్రాజెక్టు కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు గణేష్, మండల అధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

శక్తి యాప్ మహిళలకు వరం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

కైకలూరు: మహిళల భద్రతపై ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ మహిళలకు వరం లాంటిదని కైకలూరు సర్కిల్ సీఐ వి.రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద శక్తి యాప్, సైబర్ క్రైమ్‌పై గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, మహిళా పోలీసులకు సోమవారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు ఈ యాప్ ఉపయోగపడుతోందన్నారు. కైకలూరు రూరల్, మండవల్లి ఎస్ఐలు వి.రాంబాబు, రామచంద్రరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని దేవపూడి ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ముదినేపల్లి సెక్షన్ విద్యుత్ అధికారులు తెలిపారు. ఫీడర్ పరిధిలో అల్లూరు, బొమ్మినంపాడు, రామచంద్రాపురం నుంచి దేవపూడి, ప్రొద్దువాక ఆక్వాబెల్టు వరకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు నిలిపివేత

ముదినేపల్లి రూరల్: అనుమతులు లేకుండా చెరువు తవ్వగా వచ్చిన మట్టిని అక్రమంగా తరలించడాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. మండలంలోని చిగురుకోట శివారు నరసన్నపాలెంలో ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టు చప్పుడు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా పొక్లయిన్లతో చెరువు తవ్వుతూ మట్టిని బయటకు తరలిస్తున్నారు. స్థానికులు దీనిపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో వీఆర్వో వీరబాబు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. చెరువు తవ్వకానికి అనుమతులు లేకపోవడాన్ని గుర్తించి పొక్లయిన్ మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపివేశారు. ఈ ఘటనపై తహసీల్దార్ సుభానీ మాట్లాడుతూ అనుమతులు లేకుండా చెరువు తవ్వకాలు, మట్టి తరలింపులు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమతుల కోసం అర్జీ పెట్టుకోవాలన్నారు.